పిటిషనర్లకు నోటీసులు ఇవ్వకుండా సేల్ డీడ్స్ రద్దు చెల్లదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదుర్ భూమి రిజిస్ట్రేషన్లకు చెందిన 17 సేల్‌డీడ్స్‌ను 2017లో సబ్ రిజిస్ట్రార్ రద్దు చేయడం చెల్లదని హైకోర్టు తీర్పు వెలువరించింది. పిటిషనర్లకు నోటీసులు కూడా ఇవ్వకుండా రద్దు చేయడం చెల్లదని తేల్చి చెప్పింది. సేల్‌డీడ్‌లను రద్దు చేసిన భూములు నిషేధిత జాబితాలో కూడా లేవని పేర్కొంది. ఈ భూములు తమవేనని ప్రభుత్వం భావిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని వెల్లడించింది. అందుకు ఈ ఉత్తర్వులు అడ్డంకి కాబోవని స్పష్టం చేసింది. సేల్‌డీడ్స్ రద్దును సవాలు చేస్తూ పి.ధీరజ్, రంగారెడ్డి మరో ఇద్దరు వేసిన పిటిషన్లపై జస్టిస్ కాజా శరత్ తీర్పు వెలువరించారు. సబ్ రిజిస్ట్రార్ ఉత్తర్వులను రద్దు చేస్తున్నామని, చట్టప్రకారమే చర్యలను కలెక్టర్ తీసుకోవచ్చని చెప్పారు.

రెండు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల మంజూరు

- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో గంగాధర మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంజూరు చేశామని తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మరో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంజూరు చేశామని వివరించారు. ఆ రెండు కాలేజీల్లో వచ్చే విద్యాసంవత్సరం (2026–27) నుంచి తరగతులు ప్రారంభమయ్యే అవకాశమున్నది. రాష్ట్రంలో 119 ప్రభుత్వ, 35 ప్రభుత్వ అటానమస్ కలిపి మొత్తం 154 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలున్నాయి. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నూతన భవన నిర్మాణం కోసం రూ.6.10 కోట్లు విడుదల చేశామని యోగితారాణా తెలిపారు.

బిసి బంద్ సక్సెస్

- అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు
- కాంగ్రెస్, బిఆర్ఎస్, వామపక్షాల ర్యాలీలు
- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మానవహారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి' అనే డిమాండ్‌పై బిసి జెఎసి ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం నిర్వహించిన రాష్ట్ర బంద్ జయప్రదమైంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్‌తో పాటు వామపక్షాలు, టిజెఎస్, మేధావులు, ప్రజా సంఘాలు ఈ బంద్‌లో పాల్గొన్నాయి. ఆర్‌టిసి బస్సులు డిపోలకే పరిమితం కాగా... హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాలు, జిల్లాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రజలందరూ స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. వ్యాపారులు దుకాణాలను మూసేశారు. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లకు మద్దతిస్తున్న బిజెపి, కేంద్రంలో మాత్రం వాటిని అడ్డుకుంటోందని సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు దుయ్యబట్టాయి. ఆ పార్టీ ద్వంద్వ వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చాయి. బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టిసి బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. హైదరాబాద్‌లో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. సచివాలయం చుట్టూ ఉన్న ప్రధాన రోడ్లలో నిరసన ప్రదర్శలను చేపట్టారు. తెలుగుతల్లి ఫ్లై ఓవర్, ఆ పక్కనే ఉన్న అంబేద్కర్ విగ్రహం, ఖైరతాబాద్ చౌరస్తా, లుంబినీ పార్కు, నెక్లెస్ రోడ్ తదితర ప్రాంతాల్లో ర్యాలీలు, సభలు జరిగాయి. అధికారికంగా సెలవు దినం కాకపోయిప్పటికీ సచివాలయం సైతం బోసిపోయింది. కొద్ది మంది అధికారులు తప్ప సందర్శకులు, ప్రజలెవ్వరూ అటు వైపునకు రాలేదు. పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు తెలుగుతల్లి ఫ్లై ఓవర్ పక్కనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. మంత్రి కొండా సురేఖ సికింద్రాబాద్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. బంద్ నేపథ్యంలో బిసి జెఎసి నేతలు శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకే హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ (ఎంజిబిఎస్)కు చేరుకుని బైఠాయించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'బిజెపి తన మొండి వైఖరిని విడనాడాలి, 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి...' అని వారు డిమాండ్ చేశారు. పలువురు కళాకారులు ఆటపాటలతో ధూంధాం నిర్వహించారు.

వామపక్షాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రదర్శనలో నేతలు బిజెపి వైఖరిని ఎండగట్టారు. రిజర్వేషన్ల అంశంలో అసలు విలన్ ఆ పార్టీయేనని వారు విమర్శించారు. ఈ అంశాన్ని ప్రజలకు విడమరిచి చెప్పాలని పిలుపునిచ్చారు. ఖైరతాబాద్ చౌరస్తాలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మానవహారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. కాగా బిసి రిజర్వేషన్లను కేంద్రంలో అడ్డుకుంటున్న బిజెపి నేతలు సైతం బంద్‌లో పాల్గొనటం గమనార్హం. సికింద్రాబాద్ జూబ్లీబస్ స్టేషన్ వద్ద జరిగిన ర్యాలీలో ఆ పార్టీ ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. మాల మహానాడు, ఆదివాసీ, గిరిజన, విద్యార్థి సంఘాలు కూడా బంద్‌లో పాల్గొన్నాయి.

మూతపడిన వాణిజ్య సముదాయాలు

బిసి జెఎసి, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఎక్కడికక్కడా నిరసన ప్రదర్శనలు జరిగాయి. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనడంతో వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. ఆర్‌టిసి చక్రాలు ఆగిపోయాయి. స్వచ్ఛందంగా షాపులు మూసేశారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. యూనివర్సిటీల్లో పరీక్షలు వాయిదా వేశారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మలను సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ క్రమంలో పలుచోట్ల పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ డిపో2 వద్ద బంద్‌కు మద్దతుగా నిరసనలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఓయూలోని అన్ని కళాశాలలు, కార్యాలయాల్లో అధికారులు బైకాట్ చేసి ఆర్ట్స్ కళాశాల దగ్గర మానవహారంగా ఏర్పడ్డారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం సుందరయ్య పార్కు దగ్గర నిరసన ప్రదర్శన నిర్వహించింది. అంబర్‌పేట్‌లో మహంకాళి అమ్మవారి దేవాలయం నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ ముందు భాగాన మాజీ ఎంపీ హనుమంతరావు కాళ్లకు బ్యానర్ తగలడంతో కింద పడిపోయారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ వేర్వేరుగా ప్రదర్శనలు తీశాయి. ఈ క్రమంలో రెండు పార్టీల నాయకులు ఎదురెదురు పడటంతో కొద్దిపాటి తోపులాట జరిగింది.

బిసి ఉద్యమానికి అండగా కవులు, రచయితలు

బిసిల న్యాయబద్ధమైన, రాజ్యాంగపరమైన హక్కుల సాధన కోసం కవులు, రచయితలు ఆ సామాజిక ఉద్యమం వెంట నిలుస్తారని పలువురు కవులు, రచయితలు, సాహిత్య సంఘాల నేతలు తెలిపారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యేల నివాస సముదాయం ముందు ఉన్న మహాత్మ జ్యోతిబాపులే, సావిత్రిబాపులే విగ్రహాలకు కవులు రచయితలు పూలమాలలేసి బంద్‌కు మద్దతు తెలియజేస్తూ, ఆ ఉద్యమానికి సంఘీబావం ప్రకటించారు.

మంత్రివర్గంపై ప్రతిపక్షాల ఆరోపణలు అవాస్తవ

- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రి వర్గంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. క్యాబినేట్ సమావేశంలో మంత్రులు వర్గాలుగా విడిపోయి గొడవలు పడ్డారంటూ కట్టుకథల్ని సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారంతా సినిమాల్లో 'రచయితలు'గా ప్రయత్నిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని హితవు పలికారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గం సమిష్టిగా రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తుందని స్పష్టం చేశారు. భావితరాల భవిష్యత్ కోసం నిబద్ధతతో అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రులకు ప్రత్యేకంగా వ్యక్తిగత అజెండా అంటూ ఏదీ లేదన్నారు. అవకాశమిచ్చిన తెలంగాణ ప్రజల ఆశయాలు, ఆకాంక్షలే మా అందరి అజెండా అని తేల్చి చెప్పారు. అంతర్గత కుమ్ములాటలను కప్పిపుచ్చుకోవడానికి మాపై బురద చల్లడం ఇకనైనా మానుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు. రాజకీయాలను పక్కన పెట్టి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని, లేదంటే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

గుస్సాడి దండారీ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌పి అఖిల్ మహాజన్

ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలు గొప్పవి

- గుస్సాడి దండారీ ఉత్సవాల్లో ఎస్‌పి అఖిల్ మహాజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలు గొప్పవని, వాటిని కాపాడుకుంటూ అన్ని రంగాల్లో రాణించాలని ఆదిలాబాద్ ఎస్‌పి అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సిరికొండ మండలంలోని రిమ్మ గ్రామంలో ఆదివాసుల పెద్ద పండుగైన గుస్సాడి దండారీ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్‌పి కాజల్‌సింగ్‌తో కలిసి ఎస్‌పి పాల్గొన్నారు. గ్రామానికి మొదటిసారిగా విచ్చేసిన ఎస్‌పి అఖిల్ మహాజన్, ఎఎస్‌పి కాజల్‌సింగ్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ఆదివాసులది విభిన్నమైన సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని అన్నారు. వాటిని కాపాడుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించి, భావితరాలకు తమ సంప్రదాయాలను తెలియపరుస్తూనే అభివృద్ధి సాధించాలని సూచించారు. ముఖ్యంగా యువత విద్యకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోలీసులతో కలిసి పోరాడాలని చెప్పారు. ఏవైనా అనారోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలని, మంత్రతంత్రాలను నమ్మొద్దని సూచించారు.

బిసి రిజర్వేషన్ల పట్ల కేంద్రం నిర్లక్ష్యం

- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్ల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కువద్ద చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో బంద్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి, కేంద్రానికి పంపించినప్పటికీ మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను మాత్రం రాత్రికి రాత్రే అనుకుని మరుసటి రోజే పార్లమెంట్‌లో పెట్టి బిల్ పాస్ చేశారని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లపై ఆరు నెలలైనా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం వి. రమణ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే వాటికి చట్టబద్ద రక్షణ ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకుని కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆశయ్య, జీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నర్సింహ్మ, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు, సీఐటీయూ నాయకులు జి నరేష్, సమ్మె గౌడ్ వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

అలసత్వాన్ని సహించం

- విధుల్లో నిర్వక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- కేంద్రం నుంచి రావాల్సిన వాటాలకు ప్రాధాన్యత ఇవ్వండి
- ఉన్నతాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్ని విభాగాల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగ అధిపతులను హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో అలసత్వాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీ కొందరు అధికారుల పనితీరులో ఇంకా మార్పు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరికివారు సొంత నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని, అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు, కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సిఎస్ రామకృష్ణారావు, సిఎంఒ కార్యదర్శులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే విషయంలో అధికారులు మరింత చురుగ్గా పని చేయాలని చెప్పారు. అన్ని విభాగాల కార్యదర్శుల నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని, పనుల పురోగతిని సమీక్షించాలని సిఎస్‌ను ఆదేశించారు. ప్రభుత్వం తరపున తీసుకోవాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సిఎంఒ అధికారులకు సూచించారు. ఎక్కడ కూడా ఫైళ్లు, పనులు ఆగిపోవడానికి వీల్లేదని హెచ్చరించారు. కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రావాల్సిన నిధులను రాబట్టుకునే కార్యాచరణను వెంటనే చేపట్టాలని అన్ని శాఖల కార్యదర్శులను ఆదేశించారు. ఏయే పథకాల్లో రాష్ట్ర వాటా చెల్లిస్తే, కేంద్రం నుంచి నిధులు వస్తాయో.. అలాంటి వాటికి ముందుగా ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇకపై సిఎస్‌తో పాటు సిఎంఒ అధికారులు తమ పరిధిలోని విభాగాలపై ప్రతి వారం తనకు నివేదికలు అందించాలని, తానే స్వయంగా వాటిపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్, బిజెపి డ్రామాలు

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్, బిజెపి డ్రామాలాడుతున్నాయని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రిజర్వేషన్లకు మద్దతు పలికిన తర్వాత వీటిని ఎవరు ఆపుతున్నారని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో బిజెపికి 240 మంది ఎంపిలు, కాంగ్రెస్‌కు 99 మంది ఎంపిల బలం ఉందని, వీరు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే రిజర్వేషన్లు అమలవుతాయని తెలిపారు. ఈ అంశంపై ఢిల్లీలో కొట్లాడాల్సిన రెండు జాతీయ పార్టీలు, బిసిలను మభ్యపెడుతూ గల్లీలో డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు. ఆరుసార్లు జనాభా లెక్కలు తీసిన కాంగ్రెస్ ఏనాడూ బిసి గణన చేయలేదని గుర్తు చేశారు. బిజెపి ఏకంగా జనగణనను నాలుగేళ్లుగా వాయిదా వేస్తూ వస్తోందని విమర్శించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎనిమిది మంది బిజెపి ఎంపిలు ఎందుకు కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి పొందేందుకు ఇప్పుడు ఒకరిని మించి ఇంకొకరు నటిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏ పార్టీ బిల్లు పెట్టినా బిఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని, ఎలాంటి పోరాటానికైనా కలిసి వస్తుందని స్పష్టం చేశారు.

సదరంలో 'నకిలీ' దుమారం

- కలెక్టర్ సీరియస్.. కొత్త డేటా ఎంట్రీ ఆపరేటర్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పలుచోట్ల నకిలీ సదరం సర్టిఫికెట్లు వెలుగుచూస్తున్నాయి. ఈ డూప్లికేట్ వ్యవహారంలో అవుట్ సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డిఇఒ) కీలకంగా వ్యవహరిస్తున్నట్టు బయటపడుతోంది. ఎలాంటి వైకల్యం లేకున్నా ఖమ్మంలో ఏకంగా డిఇఒనే తన పేరుతో నకిలీ వైకల్య సర్టిఫికెట్‌ను సృష్టించుకోవటం కలకలం రేపింది. ఈ నకిలీ గుట్టు బయటకు రావటంతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కొద్దిరోజుల క్రితం విచారణకు ఆదేశించారు. జిల్లా మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేత ఎంక్వయిరీ నిర్వహించారు. పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. సంబంధిత అవుట్ సోర్సింగ్ డిఇఒకు ఎలాంటి వైకల్యం లేకున్నా తనకు తానే డూప్లికేట్ సదరం సర్టిఫికెట్‌ను సృష్టించుకున్న ఉదంతం వెలుగుచూడటం పలు అనుమానాలకు తావిస్తోంది. సదరం విభాగం నిర్వహణ లోపాలకు ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. నిక్షేపంలా ఉండే ఈ డిఇఒ రెండు కాళ్లు చేతుల కండరాలు 75శాతం మేరకు కదలిక లేవని (లోకోమోటార్ డిజెబిలిటీ) సర్టిఫికెట్‌ను తయారు చేసుకోవటం, దాన్ని సంబంధిత డాక్టర్లు ధ్రువీకరించటం సంచలనంగా మారింది.

ఈ డిఇఒదంతా నకిలీ వ్యవహారమే..!

ఈ డిఇఒదంతా నకిలీ వ్యవహారమేనని తెలుస్తోంది. ఈయన 2015లో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయం (డిఆర్‌డిఎ)లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా చేరాడు. రెండు, మూడునెలలు సదరం విభాగంలో పనిచేశాడు. అప్పట్లో అక్రమాలకు పాల్పడుతుండటాన్ని గుర్తించి తొలగించారు. కొన్నిరోజుల పాటు కార్యాలయం చుట్టూ తిరిగాడు. 2015–20 వరకు సదరం విభాగంలో పనిచేసినట్టు ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి తిరిగి స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ సిసి దగ్గర ఉద్యోగం పొందాడు. అక్కడి నుంచి పైరవీతో డిఆర్‌డిఎ సదరం విభాగం ద్వారా జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ఏడాది మార్చిలో చేరాడు. నాటి నుంచి ఫేక్ సర్టిఫికెట్లు జారీ చేస్తూ రూ.లక్షల్లో కూడబెడుతున్నాడు.

డేటా ఎంట్రీ.. ఆన్‌లైన్ తతంగమంతా డీఈవోల చేతుల్లోనే..!

గతంలో సదరం శిబిరం నెలలో చివరి వారం నిర్వహించేవారు. తర్వాత మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చేవారు. ఆ తర్వాత యుడిఐడిని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనివల్ల సెల్‌ఫోన్, ఇంటర్నెట్ సహాయంతో స్లాట్ బుక్ చేసుకుంటున్నారు. ఆ తర్వాత క్యాంప్ తేదీ వెల్లడవుతుంది. శిబిరానికి హాజరైతే ఫిజియోథెరపిస్టులు తొలుత చెక్ చేస్తారు. శరీర అవయవాల కదలికలను నిర్ధారిస్తారు. ఆ తర్వాత ఆర్థో, ఇఎన్‌టి, ఐ స్పెషలిస్టులు, మానసిక వైద్య నిపుణులు.. ఇలా కేసును బట్టి ఆయా డాక్టర్లు పరీక్షిస్తారు. ఎంత శాతం మేరకు వైకల్యం ఉందో నిర్ధారిస్తారు. పరీక్షల అనంతరం డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డిఇఒలు) ఆన్‌లైన్‌లో వివరాలు ఎంట్రీ చేస్తారు. ఎంట్రీకి ముందు ప్రింట్ అవుట్‌లు తీసి మెడికల్ బోర్డు (గవర్నమెంట్ ఆస్పత్రి సూపరింటెండెంట్, పరీక్షలు నిర్వహించిన వైద్యులు, ఆర్ఎంఒ) డాక్టర్లు సంతకాలు చేస్తారు. ఆ తర్వాత స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. దరఖాస్తుదారులకు ఓ సర్టిఫైడ్ కాపీ ఇస్తారు. పింఛన్లు, ఇతరత్ర ఎలాంటి బెనిఫిట్స్ రావాలన్నా దరఖాస్తుదారు ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకుంటే ఇంటర్నెట్‌లో చెక్ చేసి సర్టిఫికెట్‌ను జారీ చేసేది డిఇఒలే కాబట్టి వీరి పాత్ర కీలకంగా ఉంటుంది.

పర్మినెంట్ డిఇఒలు లేకపోవటంతోనే అవకతవకలు

దాదాపు చాలా జిల్లాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతోనే సదరం విభాగాన్ని నిర్వహిస్తున్నారు. వీరు పర్మినెంట్ ఉద్యోగులు కాకపోవటంతో ఉద్యోగం ఉన్నంతకాలం కూడబెట్టుకోవాలనే ఆలోచనతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మొత్తం ఈ విభాగంలో డేటా ఎంట్రీతో పాటు ఎంక్వయిరీ, ఇతరత్ర పనుల నిమిత్తం డాక్టర్లు కాకుండా ఆరుగురు ఉద్యోగుల వరకు పనిచేస్తుంటారు. డాక్టర్లు మినహా మిగిలిన ఆరుగురు కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కావటంతో అందరూ కుమ్మక్కై అక్రమ దందా సాగిస్తున్నట్టు చర్చ సాగుతోంది. కాబట్టి ఇప్పటికైనా జూనియర్, సీనియర్ అసిస్టెంట్ స్థాయి శాశ్వత ఉద్యోగులను నియమిస్తే బాధ్యతాయుతంగా వ్యవహరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం డిఆర్‌డిఎ సదరం విభాగం నుంచి నకిలీ సర్టిఫికెట్ సృష్టించుకున్న తాత్కాలిక ఉద్యోగి (డిఇఒ)పై ఎన్‌సిఆర్‌డి సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు సైతం గత నెల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఖమ్మంలో ఫేక్‌సర్టిఫికెట్ సృష్టించుకున్న డిఇఒపై విచారణ

ఖమ్మంలో ఫేక్‌సర్టిఫికెట్ సృష్టించుకున్న డిఇఒపై విచారణ కొనసాగుతోంది. జిల్లా మహిళా ప్రాంగణం అధికారి విజేత విచారణ నిర్వహించారు. దీనికి సంబంధించిన రిపోర్టును కలెక్టర్ అనుదీప్‌కు సమర్పించారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు గానీ ఈ ఫేక్ సర్టిఫికెట్ సృష్టికర్తను మాత్రం విధుల నుంచి తొలగించలేదు. మరోవైపు కొత్త డిఇఒ పోస్టులు రెండింటిని భర్తీ చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిలో భాగంగా నిర్వహించిన పరీక్షకు సుమారు 300 మంది వరకు హాజరయ్యారు. వీరిలో 21 మందిని టైప్ టెస్టుకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఇద్దరు డిఇఒల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.

ఎసిబి వరకు వెళ్లిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీఈవోల ఉదంతం

గతేడాది డిసెంబర్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిఇఒల అక్రమ వ్యవహారం ఎసిబి వరకూ వెళ్లింది. డిఇఒలు చేతివాటం ప్రదర్శించి జారీ చేసిన ఫేక్ సర్టిఫికెట్ల ఆధారంగా పింఛన్లు, పన్ను మినహాయింపులు, ఇతర సౌకర్యాలు పొందుతున్నట్టు స్పష్టమైంది. దీనిలో డిఆర్‌డిఎ, కరీంనగర్ సివిల్ ఆస్పత్రి వర్గాలు పరస్పరం నిందించుకున్న సందర్భాలూ ఉన్నాయి. 2011 నుంచి 2021 సంవత్సరాల మధ్యకాలంలో ఈ సర్టిఫికెట్లు జారీ అయిన విషయం వెలుగుచూసింది. నాడు ఎసిబి డిజి శ్రీనివాసరెడ్డి సైతం స్వయంగా దృష్టి సారించి విచారణను పర్యవేక్షించారు. ఇందులోనూ ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులను తొలగించటంతో ఈ వ్యవహారానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.

కలెక్టర్ నిర్ణయం మేరకు చర్యలు : ఎం. నరేందర్, ఖమ్మం జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

నకిలీ సర్టిఫికెట్ల విషయమై ఓ డిఇఒపై వచ్చిన అభియోగాలపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణ పూర్తయింది. నివేదికను సైతం సంబంధిత విచారణ అధికారి కలెక్టర్‌కు ఇచ్చారు. దీనిపై ఎలాంటి చర్యలు ఉంటాయో కలెక్టర్ నిర్ధారిస్తారు

IN THE HON'BLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION): AT VISAKHAPATNAM
O.S.1909/2022

Between:
Kovvuri Srinvasa Reddy ...Plaintiff
And:
Samskruthi Infra Projects,
Rep., by its Managing Partner
Vysyaraju Srinivasa Raju & 4 others
...Defendants

SUMMONS

To
D-4:Sri Veeranagari Gautham Reddy
S/o. Narendra Reddy,
Partner of Jaagruthi Ventures,
R/at D.No. T1, Plot No.85A,
Road No.11, Film Nagar, Hyderabad,
Telangana-96

The above named plaintiff has filed the above suit for recovery of money basing on the sale agreement and for costs of the suit, etc., and the Hon'ble Court was pleased to order issuance of notice to you by way of substituted service of summons i.e., Paper publication as you have intentionally avoided service of notice. You are hereby summoned to appear before the above mentioned Court on **10-11-2025 at 10.30 A.M.** in person or through an advocate in the above case or else the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
P. SUBBA REDDY,
Advocate
Viskakhapatnam,
Cell: 7386239666.

స్వర్ణకారుల బతుకులు దుర్భరం

- బంగారం ధరల పెరుగుదలతో తగ్గిన ఉపాధి
- సామాన్యుల కొనుగోలు శక్తి మీదే వారి జీవనాధారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల తయారీలో స్వర్ణకారులది అందెవేసిన చేయి. ఆధునిక యుగంలో కంప్యూటర్‌లు సైతం తయారు చేయలేని డిజైన్‌లు చేయడంలో నేర్పరులు. అలాంటి స్వర్ణకారులు నేడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. సామాన్యులు ఎంత బంగారం కొనుగోలు చేస్తే వారికి అంత ఉపాధి. కానీ ప్రస్తుతం పెరుగుతున్న బంగారం ధరలకు సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. బంగారం కొనుగోలు చేయాలంటేనే జంకుతున్నారు. దీంతో స్వర్ణకారులకు ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పడుతున్నాయి. వృత్తి పేరులో 'స్వర్ణం' ఉన్నా వీరి బతుకులు మాత్రం దుర్భరంగా మారుతున్నాయి. దీనికి తోడు ఈ పని చేస్తున్న వారికి పిల్లనివ్వకపోవడంతో ఈ వృత్తిలోకి కొత్తతరం రాలేకపోతోంది.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 వేల మంది స్వర్ణకారులు ఉండొచ్చని అంచనా. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సుమారు 600 మంది వరకు స్వర్ణకారులు పనిచేస్తున్నారు. కామారెడ్డి పట్టణంలో 200 దుకాణాలు ఉండగా... 300 మంది వరకు ఈ వృత్తిని నమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఒక వైపు బడా షోరూమ్‌ల రెడీమేడ్ నగలు, మరో వైపు కంప్యూటరైజ్డ్ మోడల్స్‌తో పాటు 1 గ్రామ్ రోల్డ్‌గోల్డ్ ఆభరణాలతో ఉపాధి తగ్గుతూ వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా బంగారం ధరలు పెరిగిపోతుండటంతో స్వర్ణకారుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

సామాన్యుల కొనుగోలు శక్తే కులవృత్తులకు ఊతం

సాధారణంగా సామాన్య ప్రజల కొనుగోలు శక్తి మీదే ప్రధానంగా కులవృత్తుల వారు ఆధారపడి జీవిస్తుంటారు. ప్రస్తుతం బంగారం ధరలు రాకెట్ వేగంగా దూసుకుపోతుండటంతో సామాన్యులు బంగారం అంటేనే హడలిపోతున్నారు. వారు కొనలేకపోవడంతో ఆభరణాల తయారీకి గిరాకీ లేకుండా పోతోంది. డబ్బులున్న వారు కొనుగోలు చేస్తున్నా.. ఆభరణాలు చేయించుకోకుండా బిస్కెట్ రూపంలోనే దాచుకుంటున్నారు. దీంతో వీరికి ఉపాధి లేక బిక్కుబిక్కుమంటున్నారు.

మాసంలోనే పుస్తెలు.. గుర్జకు సైతం లెక్కే...

సాధారణంగా మధ్యతరగతి వారు పుస్తెలు చేయించుకునేందుకు మాసన్నర (గ్రామున్నర) బంగారం కొనుగోలు చేస్తుండే వారు. కానీ ప్రస్తుత ధరలతో మాసం (గ్రాము) కొనుగోలుతోనే సరిపెట్టుకునే పరిస్థితి నెలకొంది. గతంలో ఆభరణం తయారు చేసి ఇచ్చే క్రమంలో గుర్జ (మాసంలో పదోవంతు) ఎక్కువ తక్కువ అయినా స్వర్ణకారులు పెద్దగా పట్టించుకునే వారు కాదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక్క గుర్జకు రూ.1300 ఉండటంతో అదీ లెక్కల్లో చేరింది. నిన్న ఉన్న రేటు ఈరోజు ఉండకపోవడంతో.. ఆభరణాలు తయారు చేసి ఇచ్చే క్రమంలో బంగారం ధర వ్యత్యాసం ప్రకారం ధర కట్టించేందుకు కస్టమర్‌లు ఒప్పుకునే పరిస్థితి లేకుండా పోతోంది. ఆభరణం తయారు చేసే క్రమంలో ఇచ్చిన బంగారం కంటే ఒకటి, రెండు గ్రాముల బంగారం ఎక్కువ కావొచ్చు.. తక్కువ కావొచ్చు. కానీ ధరల వ్యత్యాసంతో వినియోగదారులు స్వర్ణకారులతో లొల్లికి దిగే పరిస్థితి తలెత్తింది.

పెండ్లికి పిల్లనిస్తలే.. కొత్త తరం రావట్లే..

ఓ పక్క బంగారు ఆభరణాల విక్రయ దుకాణాలు పెరుగుతుండటం, మరోవైపు బంగారం ధర పెరుగు తుండడంతో స్వర్ణకారులు ఉపాధి లేక దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఈ కులవృత్తి చేసే వారికి పెళ్లికి పిల్లనివ్వలేని పరిస్థితి నెలకొంది. కులవృత్తిని వదిలి ఇతర పనుల వైపు మొగ్గు చూపే పరిస్థితి తలెత్తింది. కొత్త తరం ఈ వృత్తిలోకి రాలేకపోతోంది. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల వారు ఇక్కడికి వచ్చి ఈ వృత్తి చేపడుతుండటం గమనార్హం. బెంగాల్ నుంచి వచ్చి నిజామాబాద్‌లో పని చేస్తున్న ఓ వ్యక్తి.. వ్యాపారుల బంగారంతో ఉడాయించినట్టు సమాచారం.

సామాన్యుల చేతిలో కులవృత్తుల మనుగడ

మర్కంటి పి.శ్రీనివాస్, స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు, కామారెడ్డి

సామాన్యుల చేతిలో కులవృత్తుల మనుగడ ఉంటుంది. కానీ ఇప్పుడు బంగారం ధర అందనంత ఎత్తులో ఉండటంతో సామాన్యులు బంగారం కొనుగోలుకు దూరమయ్యారు. ఫలితంగా మాకు ఉపాధి లేకుండా పోతోంది. ఈ వృత్తిలో పాత వారిమే నెట్టుకొస్తున్నాం కానీ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొత్తగా పని నేర్చుకొని వచ్చే వారికి చాలా కష్టంగా ఉంది. మా వృత్తిలో ఉన్న వారికి పెళ్లికి పిల్లను కూడా ఇస్తలేరు.

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
(ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్)
ఓ.ఎస్. నెం: 425/2020

వట్టి వెంగల్‌రెడ్డి .... వాది
వర్సెస్
ఎం.డి.ఖాజా పాషా .... ప్రతివాది

టు,
ఎం.డి.ఖాజా పాషా, తండ్రి: లేట్ దస్తగిరి
డోర్ నెం: 16-2-74739, ముంతాజ్ కాలనీ,
న్యూ పోలీస్ స్టేషన్, సైదాబద్,
హైదరాబాద్-500059, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు దావాలో వాది ప్లెయింట్ పరిహారం రాబట్టుకొను నిమిత్తం నీపైన దాఖలు చేసినందున పై దావాలో నీఆక్షేపణలు వినుటకు 24-10-2025వ తేదీకి వాయిదా వేయడమైనది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీఆక్షేపణలు తెలుపుకొనవలసినది.లేని యెడల నీపరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

(కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా: 24-10-2025
మార్కాపురం, ప్రకాశం జిల్లా
మధిరె మల్లికార్జునరెడ్డి,
వాది తరపు న్యాయవాది,

ఉద్యోగం బాధ్యత కాదు.. భావోద్వేగం

- తెలంగాణ రైజింగ్ 2047లో భాగస్వాములుకండి
- తల్లిదండ్రులను పట్టించుకోకుంటే జీతంలో కోత
- మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలిచ్చాం
- గ్రూప్-2 అభ్యర్థుల ఉద్యోగ నియామక పత్రాల అందజేతలో సిఎం రేవంత్‌రెడ్డి



ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఉద్యోగం బాధ్యత మాత్రమే కాదు.. భావోద్వేగం..నేడు నియామక పత్రాలు అందుకుంటున్న మీరంతా ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ముందుకు నడిపించండి. మూడు ట్రిలియన్ల ఆర్థిక లక్ష్యాన్ని చేధించే యత్నంలో భాగస్వాములు కండి. అప్పుడు నేనున్నా లేక పోయినా మీరంతా ఉంటారు. సర్కార్ నిర్ణయాలకనుగుణంగా నిబద్ధతతో పని చేయండి' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన 783 మంది అభ్యర్థులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి శనివారం హైదరాబాద్‌లోని శిల్ప కళావేదికలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ... "'ఈ వేదికను పంచుకుంటున్న మీరందరూ ఒకప్పుడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొని పోరాటం చేసిన వారే. నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిన పోరాటంలో ఎందరో అమరులయ్యారు. శ్రీకాంతాచారి, వేణుగోపాల్‌రెడ్డి, ఈషాన్‌రెడ్డి, యాదయ్య లాంటి యువ విద్యార్థుల ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాకారమయింది. యూనివర్సిటీల్లో ఉంటూ వేలాది మంది విద్యార్థులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆనాటి రాజకీయ పార్టీల నాయకులు.. నీళ్లు, నిధులు, నియామకాల నినాదాలను, తెలంగాణ ప్రజల బలమైన ఆకాంక్షను ఆయుధంగా మార్చుకొని పదేండ్లు రాష్ట్రంలో అధికారాన్ని చెలాయించారు. కానీ, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోలేదు. 15 సంవత్సరాల పాటు గ్రూప్-1 నియామకాలను చేపట్టలేదు. తాము అధికారం చేపట్టిన వెంటనే టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేశాం. మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలిచ్చాం. త్వరలో గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాలను భర్తీ చేస్తాం" అని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పోరాటాలు, బలిదానాలతో సిద్ధించిన తెలంగాణ అకాంక్షలను గత ప్రభుత్వం సొమ్ము చేసుకుందని విమర్శించారు. "వాళ్ల కుటుంబసభ్యులు, బంధు వర్గాన్ని ధనవంతుల్ని చేయటం కోసమే పాలన సాగింది. ప్రజల గురించి ఆలోచించి ఉంటే కాళేశ్వరం..కూలేశ్వరం అయి ఉండేది కాదు. రూ.లక్ష కోట్లతో కట్టిన ప్రాజెక్టు మూడేండ్లకే కూలిన ఘటన ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. ఫామ్‌హౌస్‌లో ఎకరా పంటపై రూ.కోటి ఆదాయం వస్తుందని ఒక పెద్దాయన చెప్పారు. ఎకరాపై రూ.కోటి ఆదాయం వచ్చే విద్యను యువత, ప్రజలకు ఎందుకు చెప్పలేదు. తమ అవసరం కోసం ఏదైనా చెప్పడం వారికే చెల్లింది" అని సిఎం విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన నేను ఈ స్థాయిలో ఉన్నానంటే మీ ఆశీర్వాదాలే కారణమని గుర్తు చేశారు. "రూ.మూడు కోట్లు తీసుకుని గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చారని గత పాలకులు ఆరోపణలు చేశారు. పేదింటి బిడ్డలు రూ.మూడు కోట్లు ఇచ్చి ఉద్యోగం కొనగలరా? కష్టపడి చదివిన వారిని అవమానించేలా మాట్లాడారు" అని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని విమర్శలు వచ్చినా ప్రభుత్వం చిత్త శుద్ధితో ముందుకు పోతుందని స్పష్టం చేశారు. 30 ఏండ్ల ఎస్‌సి వర్గీకరణ పోరాటానికి ముగింపు పలికామన్నారు. దేశంలోనే మొదటి సారిగా కులగణన చేయడంతో... జనగణనతో పాటు కులగణన చేసేలా కేంద్రానికి తప్పని సరి పరిస్థితి కల్పించామని అన్నారు. "కొత్తగా ఉద్యోగంలో చేరిన మీరందరూ తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కండి. మీరు, మేము వేరు కాదు.. మీరే మేము.. మేమే మీరు. చీకటి రోజులు పోవాలి.. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని గ్రూప్-1 విషయంలో సమస్యలన్నింటినీ ఎదుర్కొని నియామక పత్రాలు అందజేశాం. గత పాలకులు ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు కేసులు వేసి అక్రమ సంపాదనతో ఏర్పాటు చేసుకున్న సోషల్ మీడియా వ్యవస్థతో మాపై బురద జల్లే ప్రయత్నం చేశారు. అలాంటి వ్యవస్థ మాకు లేదు. మా వ్యవస్థనే మీరు. ఆ వ్యవస్థలో మీరే మా కుటుంబ సభ్యులు. ఇప్పటి వరకు మీరు సామాన్యులు. ఈ రోజు నుంచి మీరు అధికారులు. మీ వద్దకు వచ్చే నిస్సహాయులకు సాయం చేయండి. వారి సమస్యలను పరిష్కరించండి.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి. అదే సందర్భంలో మీ కుటుంబ భాధ్యతను మరవొద్దు. రక్తం చెమటగా మార్చి మిమ్మల్ని ఇంతవాళ్లను చేసిన తల్లిదండ్రులను మరిచిపోవద్దు. వారిని మరిచిపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదు. మీ జీతం నుంచి పది నుంచి 15 శాతం వారికి ఇచ్చేలా త్వరలో చట్టం తెస్తాం" అని ప్రకటించారు. ఇందుకు సంబంధించి కొత్తగా ఎంపికైన అధికారులను సభ్యులుగా చేర్చి కమిటీ వేయాలని సిఎస్ రామకృష్ణరావుకు సూచించారు. "గత పాలకులు సెంటిమెంట్‌ను రగిల్చి తిరిగి అధికారం పొందేందుకు కుట్రలు పన్నుతున్నారు. వాళ్ల కుటుంబ సభ్యులే చెబుతున్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయితే వాళ్లు పైశాచిక ఆనందం పొందుతున్నారు. అలాంటి వారి పట్ల మీరు జాగ్రత్తగ ఉండాలి. ఎలాంటి ప్రమాద ఘటనలు జరగకుండా, ఫుడ్ పాయిజన్‌తో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా చూడాలి. సమర్థవంతంగా పనిచేసి ఆదర్శంగా నిలవాలి" అని సిఎం దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, అద్దంకి దయాకర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సిఐటియులో భారీగా కార్మికుల చేరిక

- సెలవులు, 8 గంటల పని అమలు చేయాలి
- పిఎఫ్ బకాయి కార్మికుల ఖాతాల్లో జమచేయాలి

సిఐటియులో చేరుతున్న కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ వాటర్ వర్క్స్ విభాగంలో పనిచేస్తున్న సుమారు వంద మంది మున్సిపల్ కార్మికులు ఎఐటియుసి నుంచి శనివారం సిఐటియులో చేరారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి కందరపు రాజనర్సు ఆధ్వర్యంలో వారు యూనియన్‌లోకి వచ్చారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.... సిఐటియు కార్మికుల కోసం చేస్తున్న అలుపెరగని పోరాటాల వల్లే తాము ఈ యూనియన్‌లో చేరామన్నారు. తమ న్యాయమైన హక్కులను పోరాటాల ద్వారా సాధించుకుంటామని తెలిపారు. వాటర్ వార్క్స్ కార్మికులకు నెలకు 4 సెలవులు, సంవత్సరంలో 15 క్యాజువల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంపుల వద్ద పనిసేసే కార్మికులకు 8గంటల పని అమలు చేయాలని, లేదా ఓటి చెల్లించాలని కోరారు. సంవత్సరానికి రెండు జతల నాణ్యమైన దుస్తులు, సబ్బులు, నూనెలు, రెయిన్ కోట్స్ ఇవ్వాలని, పిఎఫ్ బకాయి డబ్బులను కార్మికుల ఖాతాల్లో జమచేయాలని అన్నారు. లేకుంటే దీపావళి పండుగ తర్వాత ఇపిఎఫ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఇఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైట్ కార్మికులకు కేటగిరీ వేతనాలు అందరికీ అమలు చేయాలని కోరారు. సిఐటియులో చేరిన వారిలో రాజు, కృష్ణ, శంకర్, ఇస్మాయిల్, అబ్బాస్, నాగరాజ్, మహేష్, పిట్ల శ్రీను, ధర్మ, సంజీవ్, భాస్కర్, అజయ్, నవీన్, కలీమ్, రాజు, మహమూద్, శ్రీనివాస్, లింగం, రాజయ్య, రాజు, రాములు, అన్వర్, శ్రీకాంత్, ప్రశాంత్, రాజు, రవీందర్, దేవేందర్, బాలరాజ్, ఇబ్రహీం, స్వామి, పాషా, నర్సింలు, సత్యం, బాలయ్య, రాజయ్య, శ్రీను, సిహెచ్.రాజు, రంజిత్ తదితరులు ఉన్నారు.

రెండు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల మంజూరు

- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కరీంనగ ర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో గంగాధర మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంజూరు చేశామని తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మరో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంజూరు చేశామని వివరించారు. ఆ రెండు కాలేజీల్లో వచ్చే విద్యాసంవత్సరం (2026-27) నుంచి తరగతులు ప్రారంభమయ్యే అవకాశమున్నది. రాష్ట్రంలో 119 ప్రభుత్వ, 35 ప్రభుత్వ అటానమస్ కలిపి మొత్తం 154 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలున్నాయి. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నూతన భవన నిర్మాణం కోసం రూ.6.10 కోట్లు విడుదల చేశామని యోగితారాణా తెలిపారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయంలో పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ కె.కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన జమునగారి ప్రవీణ్ కుమార్(33) వ్యవసాయంతో పాటు హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు, ముగ్గురు సోదరులతో కలిసి జీవనం కొనసాగించాడు. కొంతకాలంగా వ్యవసాయం, ఇతర అవసరాల కోసం రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడ్డాడు. శుక్రవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద ప్రవీణ్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- యూనివర్సిటీలకు బడ్జెట్ పెంచాలి : వక్తలు
- యూనివర్సిటీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభ
- 35 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని యూనివర్సిటీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభలో వక్తలు డిమాండ్ చేశారు. ఓయూలోని మహమ్మద్ ఉస్మాన్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభ ఘనంగా జరిగింది. మెట్టు రవి, పద్మశ్రీ, మహేందర్ అధ్యక్షతన వహించిన ఈ మహాసభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.పద్మశ్రీ ప్రారంభ ఉపన్యాసం చేశారు. మెట్టు రవి జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉన్నత విద్యారంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరించడానికి ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2025-26 బడ్జెట్‌లో ఉన్నత విద్యకు సరిపడా కేటాయింపులు చేయకపోవడం అన్యాయమన్నారు. యుజిసి నిబంధనలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా సడలించడం, యూనివర్సిటీలకు గ్రాంట్లు సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యా వ్యవస్థను బలహీనపరుస్తోందన్నారు. అలాగే, కార్మిక హక్కులను హరించేందుకు కార్మిక చట్టాలను ఎత్తేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్‌ల రద్దు కోసం భవిష్యత్‌లో దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నారాయణ మూడేండ్ల నివేదికను ప్రవేశపెట్టారు.

యూనివర్సిటీలలో పనిచేస్తున్న నాన్-టీచింగ్ సిబ్బందికి కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిలో, కాంట్రాక్ట్ ఉద్యోగులను టైమ్ స్కేల్ పద్ధతిలో నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యూ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేష్ మాట్లాడుతూ.. కనీస వేతనాల పెంపుదల కోసం ఆందోళనలు, పోరాటాలు ఉధృతం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరంతరం క్యాంపెయిన్ చేయాలని సూచించారు. స్థానిక సమస్యలపై అన్ని యూనివర్సిటీలలో పోరాటాలు నిర్వహించాలని, మహిళా కార్మికుల సమస్యలపై ప్రత్యేక కేంద్రీకరణతో పని చేయాలని, యంగ్ వర్కర్స్ అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మహిళలపై హింసను అరికట్టాలని, ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధం ఆపాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్న నాలుగు తీర్మానాలను కె.చిరంజీవి, ఎం.దశరథ్, ఎం.పద్మశ్రీ, మహేందర్ ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సభలో వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన రాష్ట్ర కమిటీ

మహాసభ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా కె.వెంకటేష్, అధ్యక్షులుగా మెట్టు రవి, ప్రధాన కార్యదర్శిగా వి.నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.పద్మశ్రీ, కోశాధికారిగా పి.మహేందర్, ఉపాధ్యక్షులుగా కె.చిరంజీవి, మహమ్మద్ సలార్, అమీర్, రాగుల రమేష్, కార్యదర్శులుగా ఎం.దశరథ్, డి.జగదీష్, వి.సరిత, రమేష్‌తో పాటు 35 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పడింది.

మిల్లర్ల కొర్రీలు

- పది శాతం డిపాజిట్ చేసేందుకు ససేమిరా!
- మిల్లు ట్యాగింగ్ తంటా.. కేంద్రాల నిర్వాహకుల అవస్థలు
- తడిసి ముద్దవుతున్న ధాన్యం
- 15 రోజుల నుంచి కేంద్రాలకు చేరుకుంటున్న పంట
- పేరుకే 296 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వానాకాలం ధాన్యం పంట రైతు చేతికొస్తోంది. రైతులు పంటను అమ్ముకోవడానికి ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్పినా అవి ఎక్కడా కనిపించడం లేదు. పేరుకే ఐకెపి, పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎక్కడా గింజ కూడా కాంటా వేయలేదు. జిఒ నం.17 ప్రకారం పంట కొనుగోళ్లకు పది శాతం డిపాజిట్ చేసేందుకు మిల్లర్లు ససేమిరా అంటుండటం.. మిల్లుల ట్యాగింగ్ కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు పంట అమ్ముకోలేక ధాన్యం రాశులతో రైతులు గోస పడుతున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో పంట మొత్తం తడిసిముద్దవుతోంది.

నల్లగొండ జిల్లాలో 15 రోజుల కిందట నుంచే రైతులు పంటను కోతలు కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబెడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం దొడ్డు రకం, సన్న రకం వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు ప్రకటించారు. జిల్లాలో మొత్తం 375 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలైందని అధికారులు అట్టహాసంగా 296 కేంద్రాలను ప్రారంభించారు. సూర్యాపేటలో 296 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

పేరుకే ప్రారంభం

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 6.30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 296 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కానీ ఇంతవరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతోంది. కండ్ల ముందట ధాన్యం వర్షార్పణం అవుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటివరకు మిల్లుల ట్యాగింగ్ కాకపోవడంతో నిర్వాహకులు కేంద్రాల్లో ఖాళీగా కూర్చునిపోతున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి తూకం వేయడానికి ఇంకా అనుమతులు రాలేదని చెబుతున్నారు. దీనిని అదునుగా చూసి ప్రయివేటు వారు ధాన్యాన్ని కొంటామని చెప్పి తక్కువ రేటు చెబుతున్నట్లు సమాచారం.

ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు పంపించడం.. అక్కడి నుంచి సిఎంఆర్ బియ్యంగా మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ప్రభుత్వం ముందస్తుగా సిఎంఆర్ బియ్యంకు సరిపడా పది శాతం డబ్బులు డిపాజిట్ చేయాలని జిఒ నెంబర్ 17 విడుదల చేసింది. అయితే, డబ్బులు ముందస్తుగా చెల్లించడం కుదరదని మిల్లర్లు ఇప్పటికే జిల్లా పౌరసరఫరాల అధికారికి వినతిపత్రం సమర్పించినట్టు తెలిసింది. ముందస్తుగా జిఒ నెంబర్ 17 ప్రకారం పది శాతం బ్యాంకు డిపాజిట్ చేసేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారు.

ట్యాగింగ్ కాక..

రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు పదిహేను రోజులుగా తీసుకొచ్చి ఆరబెడుతున్నా.. అధికారులు మాత్రం ఇంకా మిల్లు ట్యాగింగ్ చేయలేదు. కేంద్రాలు ప్రారంభమై ఐదు రోజులు గడిచినప్పటికీ ధాన్యాన్ని కాంటా వేయడం లేదు. రైతుల ధాన్యం వర్షాలకు తడిసి ముద్దవుతుండటంతో నిర్వాహకులు వారికి సమాధానం చెప్పలేకపోతున్నారు.

కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి
రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి. ప్రకృతి వైపరీత్యాలకు రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 15 రోజుల నుంచి రైతులు ఎదురు చూస్తున్నా కాంటా వేయకపోవడం సరికాదు. వెంటనే ధాన్యాన్ని తూకం వేయాలి.

15 రోజులుగా గోస పడుతున్నాం
మహిళా రైతు భాగ్య, ఖాజీరామరం

ప్రభుత్వం మద్దతు ధరతో పాటు రూ. 500 రూపాయల బోనస్ ఇస్తుందన్న ఆశతో మిల్లులకు పోలేదు. తమ మూడెకరాల పంటలో సగభాగం నల్లగొండ పట్టణంలోని అర్జాలబావి కొనుగోలు కేంద్రానికి 15 రోజుల కిందట తీసుకొచ్చాం. ఇంకా కాంటాలు వేయకపోవడంతో వర్షానికి ధాన్యం తడుస్తోంది. వెంటనే కొనుగోళ్లు మొదలెట్టాలి.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

- మంచిర్యాలకు చెందిన తల్లీకూతురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికాలోని చికాగో నగరంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల పట్టణానికి చెందిన తల్లీకూతురు మృతిచెందారు. మనవడి పుట్టినరోజు వేడుకకు వెళ్లే క్రమంలో వీరు ప్రయాణిస్తున్న కారును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో రమాదేవి (52), ఆమె కూతురు తేజస్విని (32) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తేజస్విని పెద్ద కొడుకు విహాన్ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణం రెడ్డి కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి విగ్నేష్, రమాదేవి దంపతులకు తేజస్విని, స్రవంతి కుమార్తెలు. వీరు వివాహం అనంతరం అమెరికాలో స్థిరపడ్డారు. చిన్న కూతురు తేజస్విని గృహప్రవేశ కార్యక్రమం ఉండటంతో నెలరోజుల కిందట విగ్నేష్, రమాదేవి అమెరికా వెళ్లారు. గృహప్రవేశం తర్వాత అక్కడే ఉన్న దంపతులు.. పెద్ద కుమార్తె స్రవంతి కుమారుడు ఇషాన్ పుట్టినరోజు వేడుకలకు శుక్రవారం చిన్న కూతురు, అల్లుడు, పిల్లలతో కలిసి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో వారి కారును ట్రక్కు ఢీకొనడంతో తేజస్విని, రమాదేవి అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తల్లీకూతురు మృతితో స్థానికంగా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ర్యాలీలో పాల్గొన్న రజక వృత్తిదారులు

అన్నింట్లోనూ వెనుకబాటుకు గురైన రజకులు

- కుల వృత్తే జీవనాధారం.. ప్రభుత్వం ఆదుకోవాలి
- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య
- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం 25వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుల వృత్తిపై ఆధారపడే అత్యధిక రజకులు జీవనం సాగిస్తున్నారని, నేటికీ వారు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తీవ్రంగా వెనుకబాటుకు గురయ్యారని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం 25వ వార్షికోత్సవ సభ జరిగింది. సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎదునూరి మదర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. రజక వృత్తిదాల సంఘం ఎన్నో పోరాటాలు నిర్వహించి ఎన్నో ఫలితాలు సాధించిందని అభినందించారు. నేటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అత్యధిక రజకులు కుల వృత్తులపైనే జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు వారి సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలో బిసి రిజర్వేషన్లు 42 శాతాన్ని వెంటనే అమలు చేసి, ఎ, బి, సి, డి వర్గీకరణ చేయాలని కోరారు. పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ.. రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, మోడ్రన్ దోబీఘాట్లకు నిధులు కేటాయించాలని, రజకుల వృత్తి స్థలాలకు హక్కు పత్రాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. పెన్షన్ పథకం ఏర్పాటు చేయాలన్నారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవి రమణ మాట్లాడుతూ.. చేతి వృత్తిదారులు.. సేవా వృత్తిదారుల్లో ప్రధానంగా రజకులున్నారని, వారి సంక్షేమ, సామాజిక భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సభలో ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి అబ్బాస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్, జిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, ప్రజా సంఘాల నాయకులు గుమ్మడి రాజు, నాగరాజు, ఎం.బాలకృష్ణ, సి.మల్లేష్, జ్యోతి ఉపేందర్, సిహెచ్.వెంకటస్వామి, సుభద్రమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్

పోలింగ్ సమయంలో తటస్థంగా ఉండాలి

- పూర్తి అవగాహనతో విధులకు హాజరవ్వాలి
- జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్, ఒపిఒలది కీలకపాత్ర అని, వారు విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంచుకుని ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అన్నారు. పోలింగ్ సమయంలో తటస్థంగా ఉండాలన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో శనివారం బంజారా హిల్స్ బంజారా భవన్‌లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఒపిఒలకు మొదటి విడత శిక్షణ నిర్వహించారు. పోలింగ్ రోజు విధులు, బాధ్యతలపై జిహెచ్ఎంసి ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రం లోపల, వెలుపల కార్యకలాపాల నిర్వహణ, ఎన్నికల అధికారులు చేయాల్సినవి, చేయకూడని అంశాలను వివరించారు. ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు ముఖ్యమైందని, అన్ని అంశాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ప్రతి ఒక్కరూ తప్పకుండా చదవడమే కాకుండా, అందులోని అన్ని నిబంధనలను తూ.చా తప్పకుండా పాటించాలని సూచించారు. పోలింగ్ ముందు రోజు చేయాల్సిన పనులను చెక్‌లిస్టు తయారు చేసుకొని విధులు నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా ప్రతి పోలింగ్ ఆఫీసర్ తీసుకోవాల్సిన మెటీరియల్, ఇవిఎంల నిర్వహణ, పిఒ, ఎపిఒ డైరీ, వారి విధులు, పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించాల్సిన సామాగ్రి, పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే వారు, మాక్ పోల్, ఇవిఎం, వివి ప్యాట్‌లను ఎలా అనుసంధానం చేయాలి వంటి అన్ని విషయాలు ఒకటికి రెండుసార్లు చదివి పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. పోలింగ్ రోజు ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఇవిఎం అనుసంధానం, మాక్ పోలింగ్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్‌లు అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సునంద, మమత, 2,300 మందికి పైగా అధికారులు పాల్గొన్నారు.

'పద్మశ్రీ' మొగులయ్య ఇంటికి కెటిఆర్

- అండగా ఉంటానని హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయనకు ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని చంపాపేట్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. మొగులయ్య ఆరోగ్యం, యోగక్షేమాల గురించి కెటిఆర్ ఆరా తీశారు. తన కంటిచూపు మందగించిందని, చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా మొగులయ్య కెటిఆర్‌కు వివరించారు. గత ప్రభుత్వం తనకు హయత్‌నగర్ మండలంలో కేటాయించిన 600 గజాల స్థలం విషయంలో కొంతమంది వ్యక్తుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులు, కోర్టు కేసుల వివరాలను కెటిఆర్‌కు వివరించారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ మొగులయ్యకు హైదరాబాద్‌లోని ఎల్‌వి ప్రసాద్ ఐ ఆస్పత్రిలో పూర్తి చికిత్సను అందించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇంటి స్థలం విషయంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. మొగులయ్యకు గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన భూమి విషయంలో కొందరు వ్యక్తులు కోర్టుల్లో కేసులు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, మొగులయ్యకు న్యాయం చేయాలని కోరారు. మొగులయ్య ఆ స్థలంలో కట్టుకున్న గదిని కూడా కొంతమంది కూల్చివేసిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఆయన భూమికి, కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని కోరారు. అవసరమైతే, మొగులయ్యకు ఎదురవుతున్న న్యాయపరమైన కేసులను ఎదుర్కొనేందుకు కూడా సహాయం అందిస్తామని కెటిఆర్ హామీ ఇచ్చారు. కెసిఆర్ తమ కుటుంబం కోసం చేసిన సహాయానికి, తమ కష్టాలన్నీ తీర్చినందుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.